క్లుప్తంగా

చిట్టారెడ్డి చెరువుకు మరమ్మతులు



చెరుకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ చిట్టారెడ్డి చెరువు కట్టకు పడిన కోతను అధికారులు జేసీబీ సహాయంతో పూడ్చివేశారు. కట్టకు కోత పడి ప్రమాదస్థితికి చేరుకోవడంతో నీటి పారుదల, రెవెన్యూ, పోలీసుశాఖలకు చెందిన జిల్లా యంత్రాంగం చెరువు వద్దకు చేరుకుని కట్టను పరిశీలించారు. దీంతో అప్రమత్తమైన యంత్రాంగం జేసీబీతో కట్టకు మరమ్మతులు చేశారు.

వీరభద్రుడికి పూజలు



పూజలు చేసిన ప్రతాప్‌రెడ్డి దంపతులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ వీరన్నగూడెంలో కొలువైన (బొంతపల్లి)భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయంలో శ్రావణమాసం పూజలు కొనసాగుతున్నాయి. మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి దంపతులు లక్షబిల్వార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకాలు, భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చన వంటి పూజలు చేశారు. శ్రావణమాసంలో మొదటి సోమవారం కావడంతో ఆలయానికి భక్తులు పెదంద సంఖ్యలో హాజరై వీరభద్రుడి దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు శివనాగులు, నరేష్, గౌరి, సోమయ్య పాల్గొన్నారు.

మా కుమార్తె వివాహానికి రండి



ఆహ్వానపత్రికను అందజేస్తున్న నిర్మల

పటాన్‌చెరు టౌన్: ఆగస్టు 7న సంగారెడ్డిలోని రామమందిరంలో నిర్వహించనున్న తమ కుమార్తె వివాహానికి హాజరుకావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి నిర్మలారెడ్డి ఆహ్వానించారు. ఈమేరకు సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఆహ్వానపత్రికను అందజేశారు.


రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ, తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లిలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. నేషనల్ హైవే అథారిటీ మేనేజర్ మొయినోద్దిన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కల్హేర్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రాంగ్ రూట్ ప్రయాణం, తదితర అంశాలపై వివరించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేస్తున్న ఎస్‌ఐ

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా చిరాగ్‌పల్లి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. సోమవారం చిరాగ్‌పల్లి ఎస్‌ఐ.రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మొగుడంపల్లి మండలం రాయిపల్లి తండా రూట్‌లో తనిఖీలు నిర్వహించారు. వాహనచోదకులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపినా, నిబంధనలు పాటించకపోయినా, లైసెన్స్ అనుమతి పత్రాలు లేకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మందకృష్ణకు సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంగారెడ్డిలో జరిగిన ఓకార్యక్రమానికి వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను భెల్ ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేశ్, సభ్యులు వెంకటేశ్, స్వామిదాస్, ప్రవీణ్, ఓంశివ, ఎల్లయ్య, దళిత బంధుసేవ అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అమీన్‌పూర్ రోడ్లు

- 13 ఏళ్ల నుంచి అదే పరిస్థితి
- వర్షానికి రోడ్లపైకి కొట్టుకు వచ్చిన ఇసుక
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు





ఇక్రిశాట్ కాలనీలో రోడ్ల పరిస్థితి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో రోడ్లు అధ్వానంగా మారాయి. పదేళ్ల క్రితం ఏర్పాటైన కొన్ని కాలనీల్లో నేటికీ మంచి రోడ్లు లేవు. పంచాయతీగా ఉన్నకాలంలో వేసిన రోడ్లకు మరమ్మతులు కూడా చేపట్ట లేదు. మున్సిపాలిటీగా ఏర్పడినప్పటికీ అమీన్‌పూర్ పట్టణంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో వరదనీటి కారణంగా రోడ్లపై ఇసుక చేరింది. సిమెంట్ రోడ్లపై బురద వచ్చి చేరడంతో నడిచే పరిస్థితి కూడా లేదు. అమీన్‌పూర్ ఇసుక బావి ఇక్రిసాట్ కాలనీలో రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. 13 ఏళ్ల క్రితం ఇక్రిశాట్ ఫేస్ టూ కాలనీ ఏర్పడినప్పటికీ అక్కడ కొత్త రోడ్లు వేయలేదు. వర్షం పడితే వరద నీరు చేరుతోంది. రోడ్లు బురదమయంగా మారుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఎస్ఎస్ఎల్ కాలనీ నుంచి బీరంగూడ శివాలయం వెళ్లే దారిలో వర్షం నీరు చేరి కుంటలా మారుతుంది. కొద్దిపాటి వర్షాలకు అక్కడ వరద నీరు చేరి రాకపోకలను పూర్తిగా స్తంభిస్తుంది. టైలర్స్ కాలనీ నుంచి లింగమయ్య కాలనీ వెళ్లే దారిలో మోడీ కాలనీ ముందు వరద నీటి కారణంగా ఇసుక వచ్చి రోడ్డుపై చేరింది. దీంతో కాలనీవాసులు సొంతంగా శ్రమదానం చేసి ఇసుకను తొలగిస్తున్నారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు వైపు నుంచి శ్రీదేవి థియేటర్‌కి వెళ్లేదారిలో రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా అన్ని కాలనీల్లోనూ డ్రైనేజీ సమస్యలు ఉన్నాయి. వర్షాలు కురిసినప్పుడు డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల వద్ద నీరు ఉబికి వస్తుంది. మురుగునీరు రోడ్లపై చేరి పౌరులను పలు ఇబ్బందులు గురిచేస్తుంది.

> **చర్యలు తీసుకుంటున్నాం..**
>
> అమీన్‌పూర్ పట్టణంలోని సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన ఉంది. వర్షాలు కురిసినప్పుడల్లా అప్రమత్తంగా ఉంటున్నాం. కొత్త రోడ్లు అవసరమైన చోట నిర్మాణం చేపడతాం. డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్నాం. సమస్యలు పరిష్కారానికి ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నాం.
>
> –ఎ.జ్యోతిరెడ్డి, కమిషనర్ అమీన్‌పూర్

> **13 ఏళ్లుగా ఇదే సమస్య**
>
> 
>
> ఇక్రిశాట్ కాలనీ ఫేజ్–2 ఏర్పడి 13 ఏళ్లు అయింది. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మట్టి రోడ్లపై నడవాల్సి వస్తుంది. వర్షాలు పడినప్పుడు రోడ్లపై నీరు చేరి నానాఅవస్థలు పడుతున్నాం. కాలనీవాసుల సమస్యలను అర్థం చేసుకుని రోడ్డు నిర్మించాలని కోరుతున్నాం.
>
> –సుమన్, ప్రైవేటు బ్యాంకు మేనేజర్, ఇక్రిశాట్ కాలనీఫేజ్–2 వాసి

అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చర్యలు



నిర్మాణాలను అడ్డుకున్న సిబ్బంది

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధి అన్నారంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. సర్వే నం 261లో ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ భూముల్లో కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపట్టి తెల్లవారే లోపు గదులు పూర్తి చేశారు. దీంతో స్థానికులు మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. తహసీల్దార్ పరమేశం ఆదేశాలతో సిబ్బంది నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పత్తి సాగులో సూచనలు పాటించాలి

ఏఓ సారిక



పత్తిసాగుపై సూచనలు చేస్తున్న ఏఓ

రాయికోడ్(అందోల్): ఇటీవల అధిక వర్షాలు కురిసిన నేపథ్యంలో పత్తిసాగులో విధిగా తమ సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి సారిక పేర్కొన్నారు. మండలంలోని నల్లంపల్లి, రాయికోడ్ తదితర గ్రామాల్లో పలువురు రైతులు సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. ఎరువులు, క్రిమిసంహారక వినియోగంపై రైతులకు సూచనలు చేశారు. అధిక వర్షాలతో పత్తి చేనుల్లో తేమశాతం అధికంగా ఉందని ఎరువులను పైపాటుగా వేయకుండా స్ప్రే రూపంలో ఎరువులను మొక్కలకు పిచికారీ చేయాలన్నారు. నత్రజని, భాస్వరం, పోటాషియం మొక్కలకు అందించే 99.19.19 కిలో ఎరువును నీటితో కలిపి ఎకరా విస్తీర్ణంలోని పత్తి మొక్కలకు ఆకులు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అంతకుముందు రాయికోడ్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. దుకాణాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు దుకాణాలను నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది నిఖిలేష్, రమేష్, ఉన్నారు.

నామమాత్రంగా రేడియల్ రోడ్లకు మరమ్మతులు



మట్టితో గుంతలను పూడ్చుతున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని రేడియల్ రోడ్లపై ఏర్పడిన గుంతలకు ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా రేడియల్ రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గుంతల రోడ్ల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవడంతో వారు క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. దీంతో స్థానిక ఆర్అండ్‌బీ అధికారులు ఆగమేఘాల మీద మట్టిని తీసుకుని వచ్చి రోడ్డుపై ఉన్న గుంతల్లో వేసి మరమ్మతులు చేశారు. ఆ మరమ్మతులకు కావాల్సిన నాలుగురు కార్మికులను తెల్లాపూర్ నైబర్‌హూడ్ అసోసియేషన్ ప్రతినిధులు పంపించడం విశేషం. రోడ్లకు నామమాత్రంగా అధికారులు మరమ్మతులు చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఈ విషయాన్ని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల, మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు స్థానికలు సిద్ధమవుతున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 14 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపరచగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా, మరో తొమ్మిది మందికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

జీవాల అపహరణకు యత్నం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మత్తు మందు ఇచ్చి మూగజీవాల(ఆవులు, ఎద్దులు)అపహరణకు గుర్తుతెలియని దుండగులు యత్నించిన సంఘటన సోమవారం మండలంలోని వెంకటాపూర్ శివారులో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు మత్తుమందు ఇచ్చి మూగజీవాలను అపహరించేందుకు యత్నించారు. స్థానికులు అప్రమత్తం కావడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజావాణిలో ఐదు ఫిర్యాదులు

నారాయణఖేడ్: ఖేడ్‌లో సబ్ కలెక్టర్ ఉమాహారతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించాక మొదటి ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రేషన్‌కార్డులతో పాటు ఆయా సమస్యలపై ఐదు ఫిర్యాదులు అందాయి. అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ అధికారులకు సూచించారు. త్వరలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

నారాయణఖేడ్: శ్రావణ సోమవారం పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భూమయ్య కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో వామన్‌రావు మహరాజ్, మారుతి మహరాజ్ శ్రీరామ కథామృతాన్ని భక్తులకు వినిపించారు. కల్పనా ఆంజనేయ స్వామి ఆలయంలో నవనాథ పురాణం, కాశీనాథ్ ఆలయంలో భస్మహారతి కార్యక్రమాలు నిర్వహించారు.

మానవ అక్రమరవాణాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మాధవకృష్ణ

జహీరాబాద్: మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ ప్రయాణికులతో మాట్లాడుతూ ఎవరైనా అక్రమ రవాణా బారిన పడితే వెంటనే రైల్వే పోలీసులు, ఉద్యోగులకు సమాచారం అందించాలన్నారు. దీంతో వెంటనే స్పందించి తగిన సహాయం అందిస్తారన్నారు. కార్యక్రమంలో స్కోప్ సంస్థ ప్రతినిధి మాణయ్య, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు



పత్తి పంటను పరిశీలిస్తున్న ఎంఈఓ అభినాష్ వర్మ

న్యాల్‌కల్(జహీరాబాద్): అధిక దిగుబడులు పొందేందుకు రైతులు మోతాదుకు మించి యూరియాను వాడడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి అభినాష్ వర్మ రైతులకు సూచించారు. మండల పరిధిలోని కాకిజన్‌వాడ, అత్నూర్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, సోయా, టమాట తదితర పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల ఎదుగుదలకు యూరియా కీలకమైనప్పటికీ సరైన సమయంలో మోతాదులో వాడితే మంచిదన్నారు. యూరియా వేసే సమయంలో నేలల్లో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కువ మోతాదులో యూరియా వాడడం వల్ల చీడ పీడలు కూడా అధికమౌతాయన్నారు.

రేపు నూతన రేషన్ కార్డుల పంపిణీ

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఈ నెల 30న పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ అంశంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వరూప, ఆయా మండలాల తహసీల్దార్లు, రేషన్ డీలర్ల ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రపురం రెవెన్యూ మండలాల పరిధిలో నూతన రేషన్ కార్డుల కోసం 9414 దరఖాస్తులు రాగా.. అర్హులైన 2096 దరఖాస్తులు ఆమోదించినట్లు తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గం వ్యాప్తంగా 74,214 రేషన్ కార్డులు వినియోగంలో ఉన్నాయని తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని.. అర్హులైన ప్రతి ఒక్కరూ మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, ఆయా మండలాల తహసీల్దార్లు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేస్తూ అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్‌లోని 5వబ్లాక్‌లోని పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో రూ.1.30 కోట్ల నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మించామన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు తన సొంత నిధులు రూ.40లక్షలతో పూర్తి చేసినట్లు చెప్పారు.

వంట గది ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని మహదేవుని ఆలయంలో నూతనంగా నిర్మించిన వంటగదిని సోమవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వామివారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

బీదర్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తాం

ఖేడ్ డిపో మేనేజర్ మల్లేశయ్య



డిపో మేనేజర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): నారాయణఖేడ్ నుంచి న్యాల్‌కల్, అత్నూర్, డప్పూర్, వడ్డి మీదుగా బీదర్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తామని నారాయణఖేడ్ డిపో మేనేజర్ మల్లేశయ్య అన్నారు. బస్సుసౌకర్యం కల్పించాలని కోరుతూ ఇటీవల పలువురు గ్రామస్తులు డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వడ్డి గ్రామాన్ని సందర్శించారు. ఆయనను గ్రామస్తులు సన్మానించారు. వడ్డి మీదుగా బీదర్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తామని డిపో మేనేజర్ పేర్కొన్నారు. అందరు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించేలా చూడాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. ఖేడ్ నుంచి బీదర్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తే ఇబ్రహీంపూర్, న్యాల్‌కల్, అత్నూర్, వడ్డి, గుంజోటి, శంశల్లాపూర్ తదితర గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. కార్యక్రమంలో మార్కెటింగ్ ఇన్‌చార్జి పాండు, గ్రామస్తులు ఆనందేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతకం గ్రహీతకు సన్మానం



శిల్ప దంపతులను సన్మానించిన పద్మశాలీలు

నారాయణఖేడ్: నిజామాబాద్ తెలంగాణ విశ్వవిద్యాలయం టాపర్‌గా ఖేడ్ పట్టణానికి చెందిన పురోహితులు మలమంచి గురురాజ శర్మ సతీమణి శిల్ప నిలిచారు. ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకం, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. కాగా గురురాజ శర్మ దంపతులను సోమవారం స్థానిక మార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. శిల్పను మహిళలు ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదువుకుని అత్యున్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. పట్టణానికి చెందిన పద్మశాలీలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కల్హేర్ ఎంపీఓగా శ్రీకాంత్

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ ఎంపీఓగా ఆర్.శ్రీకాంత్ నియామకమయ్యారు. ఇక్కడ ఎంపీఓగా పనిచేసిన శ్రీనివాస్ కంగ్టీ ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పుల్‌కల్‌లో పని చేస్తున్న శ్రీకాంత్‌ను కల్హేర్ ఎంపీఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

◆ రేపు శ్రావణమాస అనుష్టానం

నారాయణఖేడ్: ఖేడ్ బసవ మంటపంలో శ్రావణ మాసం పురస్కరించుకుని బుధవారం కాశిజ్ఞాన సింహాసనాధీశ్వర శ్రీశ్రీశ్రీ 1008 జగద్గురు డా.చంద్రశేఖర శివాచార్య మహాస్వాముల ఆధ్వర్యంలో అనుష్టాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వీరశైవ జంగమ, లింగాయత్ సమాజ్ బాధ్యులు తెలిపారు. అనుష్టాన కార్యక్రమాల్లో భాగంగా ఇష్టలింగపూజ, లింగదీక్ష ఉపదేశం, లక్షబిల్వ పుష్పార్చన, మహాప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

◆ అన్ని స్థానాల్లో సీపీఐ పోటీ

నారాయణఖేడ్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులు అన్నిచోట్ల పోటీ చేస్తారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ మహాసభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బరిలో ఉంటుందన్నారు. ఖేడ్ ప్రాంతం స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి లేకుండా వెనుకబడి ఉందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్, కార్యవర్గ సభ్యులు రుబినాబేగం, దత్తురెడ్డి కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

◆ శివాలయంలో ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని సంగమేశ్వర స్వామి దేవాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర శ్రావణ సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భవాని చంద్రను ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

◆ జలపాతం పరవళ్లు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో మొగుడంపల్లి మండలం గౌసాబాద్ వద్ద జలపాతం పరవళ్లు తొక్కుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం వద్ద నీరు ప్రవహిస్తుంది. కొండపై నుంచి నీరు జాలువారుతోంది. సజ్జరావు పేట తండా ప్రాంతంలోని జాడిమల్కాపూర్ వాటర్ ఫాల్(ఎత్తిపోతల) వద్ద కూడా జలకళ సంతరించుకుంది. నీటి పరవళ్లను చూసేందుకు సందర్శకులు ఇక్కడికి వస్తున్నారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఎత్తిపోతల వద్ద జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

◆ బీడీఎల్ సీఐగా విజయ్ కృష్ణ

పటాన్‌చెరు టౌన్: బీడీఎల్ సీఐగా విజయ్‌కృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహిస్తున్న స్వామిగౌడ్ బదిలీ పై మల్టీజోన్–2కు వెళ్లారు. ఆయన స్థానంలో సంగారెడ్డి ఎస్‌బీ–1 సీఐగా విధులు నిర్వహిస్తున్న విజయ్ కృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

◆ నాగుపాము కలకలం

సదాశివపేట(సంగారెడ్డి): నాగులచవితి వేళ సిద్దాపూర్ హౌజింగ్‌బోర్డు కాలనీలో సోమవారం సాయంత్రం నాగుపాము ప్రత్యక్షమైంది. తెల్లారితే నాగుపంచమి పండుగ నాగుపామును చూసి కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. పాము లు పట్టే వాళ్లు సమాచారం ఇవ్వగా పామును చాకచక్యంగా పట్టారు. అడివిలో వదిలేస్తానని తెలిపారు.

◆ పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పారిశుద్ధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని వార్డు అధికారులను తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వార్డు అధికారులకు వారికి కేటాయించిన వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. రోడ్లపై ప్రజలు చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లపై సర్వే చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సార్.. మా సమస్యలు తీర్చండి



కలెక్టరేట్‌లో హరీశ్‌రావుతో గోడు వెళ్లబోసుకుంటున్న ప్రజలు

మాజీ మంత్రి హరీశ్‌రావు సిగాచి ప్రమాద ఘటనలో మృతి చెందిన కుటుంబాలతో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ చంద్ర శేఖర్‌ను కలిసి బాధితులకు త్వరగా న్యాయం చేయాలని కోరారు. అనంతరం ప్రజావాణికి హాజరైన జనం హరీశ్‌రావును పిలిచి సార్ మా సమస్యలు పరిష్కారం కావటం లేదు. ప్రజావాణికి ఎన్నిసార్లు తిరిగినా మా బాధలు తీరటం లేదని మీరైనా చొరవ తీసుకోవాలని వేడుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి